క్లుప్తంగా...

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోండి



కీసర: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో కంటివెలుగు వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. 97 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 36 అద్దాలు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. కమిషనర్ స్వామి, కౌన్సిలర్ మాదిరెడ్డి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం



పోచారం: అన్నోజిగూడ ఫ్లైఓవర్ నుంచి ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలమల్లేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీతో దేశ సమైక్యత, సమగ్రతలకు పెను ప్రమాదం ఏర్పడిందన్నారు. ప్రజల పక్షాన పోరాడటంలో సీపీఐ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సాయిలుగౌడ్, నియోజకవర్గ కార్యదర్శి శంకర్, నాయకులు కె.జయచంద్ర, ఈశ్వర్ పాల్గొన్నారు.

నేడు పాలకవర్గ సమావేశం

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు కమిషనర్ వాణిరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

మౌలాలి: డివిజన్ పరిధిలోని విఘ్నేశ్వరి కాలనీలో రూ.8 లక్షలతో చేపట్టిన యూజీడీ పైపులైన్ పనులను మంగళవారం కార్పొరేటర్ గున్నాల సునీతాశేఖర్‌యాదవ్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మౌలాలి డివిజన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గున్నాల చంద్రశేఖర్‌యాదవ్, శివగౌడ్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్, మల్లారెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

జలమండలి అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలి

అల్వాల్: జలమండలి అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్(బీఆర్‌ఎస్‌కేవీ) ఉద్యోగులకు జీవో నంబర్– 14, 60 ప్రకారం వేతనాలు పెంచాలని హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు అన్నారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం పాదర్ బాలయ్యనగర్, మచ్చబొల్లారం, వెంకటాపురం, అల్వాల్, మంగాపురం తదితర ప్రాంతాల్లో అవుట్ సోర్సింగ్ కార్మికులు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్మికులకు జీవో నంబర్ 14, 60 ప్రకారం వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సంఘం నాయకులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బోధనతో విద్య సులభతరం

బోడుప్పల్: మారుతున్న విద్యా విధానాన్ని దృష్టిలో ఉంచుకుని చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులకు డిజిటల్ తరగతుల బోధనను ప్రారంభిస్తున్నట్లు ఆ పాఠశాల డైరెక్టర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం చెంగిచర్లలో స్కిల్ బ్యాంక్ (యూఎస్ఎస్) సంస్థ సీఈఓలు మోపర్తి సుధాకర్, మోపర్తి లక్ష్మి, లక్ష్మీనారాయణతో ఆయన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు డిజిటల్ బోధన ద్వారా విద్యను అందించనున్నట్లు వెల్లడించారు. దీంతో విద్యార్థుల్లో జ్ఞాన సముపార్జన, విద్యను ఆర్జించడం సులభతరం అవుతుందన్నారు. పాఠశాల డైరెక్టర్ అనిల్ అయ్యంగార్, పాఠశాల ప్రిన్సిపాల్ నీలిమా పాల్గొన్నారు.

చెరువుల సంరక్షణకు చర్యలు చేపట్టండి

మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని చెరువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ గ్రేటర్ కమిషనర్ లోకేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ చెరువుల్లో మురుగు నీరు చేరడంతో దుర్గంధంతో పాటు దోమల బెడద ఎక్కువైందన్నారు. సీవరేజ్ డైవర్షన్ చేపడితేనే చెరువుల సంరక్షణ సాధ్యమవుతుందన్నారు.

సమ్మేళనాల్లో విభేదాల రాగం

నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళానికి పిలవలేదంటున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

సాక్షి, మేడ్చల్ జిల్లా: రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) బలోపేతమే లక్ష్యంగా చేపట్టిన ఆత్మీయ సమ్మేళనాలు కాస్తా.. నేతల మధ్య చాపకింద నీరులా అంతర్గతంగా కొనసాగుతున్న విభేదాలు బహిర్గతమవడంతో కేడర్ తీవ్ర అయోమయానికి గురవుతోంది. మంగళవారం దేవరయాంజల్‌లో జరిగిన మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మలిపెద్ది సుధీర్‌రెడ్డి, ఆయన తనయుడు జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి దూరంగా ఉండటంపై కార్యకర్తల్లో చర్చ సాగుతోంది.

అధిష్టానం దృష్టికి తీసుకెళ్తాం..

సమ్మేళనానికి ఆహ్వానం లేకపోవటం వల్లే హాజరు కాలేదని సుధీర్‌రెడ్డి, శరత్‌చంద్రారెడ్డి పేర్కొంటుండగా, వారిని పిలవాల్సిన అవసరమేంటి..? వారే రావాలని మంత్రి మల్లారెడ్డి వాదిస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాల్లో అందరూ పాల్గొనాలని అధిష్టానమే ఆదేశించిందని, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డిని తాను పిలవడం ఏంటని.. వారే రావాలి కదా అని మంత్రి మల్లారెడ్డి పేర్కొంటున్నారు. గతంలో మండల, పురపాలక స్థాయి సమావేశాల్లో పాల్గొన్న వారిని.. ఎవరు పిలిస్తే వచ్చారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి మాట్లాడుతూ ఆ సమావేశాలకు ఆహ్వానం ఉండటం వల్లే పాల్గొన్నామని తెలిపారు. మంత్రి మల్లారెడ్డి వ్యవహారాన్ని, ఆత్మీయ సమ్మేళనాలకు ఆహ్వానించని విషయాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాలు ఇలా..

మేడ్చల్ జిల్లాలో దాదాపు నెల రోజులుగా మండల, పురపాలక సంఘాలు, అసెంబ్లీ నియోజకవర్గం స్థాయిల్లో ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాల విజయవంతం కోసం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు పార్టీ సమన్వయకర్తగా ఎమ్మెల్సీ, రైతు బంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డిని అధిష్టానం నియమించింది. మార్చి 24 నుంచి జిల్లాలో బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలు జరుగుతుండగా, మేడ్చల్ నియోజకవర్గంలో మాత్రం 10 పురపాలక సంఘాలు, 5 మండలాల సమావేశాలకు 6 పురపాలికలు, 4 మండలాల్లో మాత్రమే జరిగాయి. ఇంకా పీర్జాదిగూడ, ఘట్‌కేసర్, నాగారం, దమ్మాయిగూడ పురపాలక సంఘాలతోపాటు ఎంసీపల్లి మండలంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాల్సి ఉంది.

గతంలో ఐదుగురు ఎమ్మెల్యేల తిరుగుబాటు..

మేడ్చల్ జిల్లాలో బీఆర్‌ఎస్ నేతల మధ్య అంతర్గంగా కొనసాగుతున్న విభేదాలు ఆత్మీయ సమ్మేళనాలతో పోతాయని భావించినా.. మరింత ముదురుతుండటంతో పరిస్థితి ఎక్కడి దారి తీస్తుందోనని పార్టీ కేడర్ ఆందోళన చెందుతోంది. గతంలోనే మంత్రి మల్లారెడ్డిపై జిల్లాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేయగా, ఇంత వరకు ఇది ఓ కొలిక్కివచ్చిన దాఖలాలు లేవు. గతంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హన్మంతరావు ఇంట్లో సమావేశమైన ఐదుగురు ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో అభివృద్ధి నిధుల విషయంలో మంత్రి మల్లారెడ్డి జోక్యాన్ని తప్పుబట్టారు. ఈ వ్యవహారాన్ని సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని వారు పేర్కొన్న విషయం తెల్సిందే. అలాగే, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ ఆదేశాలను ఖాతర్ చేయకుండా నామినేటెడ్ పదవులను కూడా మంత్రి మల్లారెడ్డి సొంత నియోజకవర్గం వారికి కట్టబెట్టారని ఆ సందర్భంలో ఎమ్మెల్యేలు ఆరోపించిన విషయం తెల్సిందే. ఈ వ్యవహారం ఇంకా చక్కబడకపోగా, నివురుగప్పిన నిప్పులా విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి.

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జెడ్పీ చైర్మన్‌ను పిలవాల్సిన అవసరమేంటి..? వారే రావాలంటున్న మంత్రి మల్లారెడ్డి
- మేడ్చల్ బీఆర్‌ఎస్‌లో బహిర్గతమైన విభేదాలు
- ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ జిల్లా నేతల మధ్య పెరుగుతున్న దూరం
- జిల్లా సమన్వయకర్తతో నేతల మధ్య సమన్వయం కుదిరేనా..?

పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా..

జిల్లాలోని మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో మంత్రి మల్లారెడ్డి వర్సెస్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఉప్పల్‌లో ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు మధ్య విభేదాలు తారస్థాయిలో ఉన్నాయి. కూకట్‌పల్లిలో కూడా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇద్దరూ తమ గ్రూపులను ప్రోత్సహిస్తున్నట్లు పార్టీ కేడర్‌లో గుసగుసలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలోని 13 పురపాలక సంఘాలలోని అధికార పార్టీ మేయర్లు, డిప్యూటీ మేయర్లు, చైర్మన్లు, వైస్ చైర్మన్లు ఉన్నప్పటికీ వారి మధ్యనే విభేదాలు పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా కొనసాగుతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని డివిజన్లతో సహా పలు గ్రామాల్లో కూడా పార్టీ ప్రజాప్రతినిధుల మధ్య అంతర్గత విభేదాలు చాపకింద నీరులా కొనసాగుతున్నాయి.

మూడింటిలో తారస్థాయిలో..

మేడ్చల్ జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఇందులో మేడ్చల్, ఉప్పల్, కుత్బుల్లాపూర్ మినహాయించి మిగతా కూకట్‌పల్లి, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో పార్టీ ఆత్మీయ సమ్మేళనాలు సాఫీగానే కొనసాగుతున్నాయి. ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల్లో చాపకింద నీరులా నాయకుల మధ్య అంతర్గత విభేదాలు కొనసాగుతున్నా.. ఆత్మీయ సమ్మేళనాలు మాత్రం సజావుగా నిర్వహిస్తున్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోనే ఆత్మీయ సమ్మేళనాల తీరు నేతల మధ్య ఆధిపత్య పోరుకు ఆజ్యం పోస్తోంది. ఇటీవల బోడుప్పల్ పురపాలక సంఘంలో జరిగిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం దీనికి నిదర్శంగా నిలుస్తోంది. బోడుప్పల్ సమ్మేళనంలో మంత్రి చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతున్న విభేదాలు భగ్గుమన్నాయి. జిల్లా సమన్వయకర్త, పార్టీ ఇన్‌చార్జి ఎమ్మెల్సీ, రాష్ట్ర రైతుబంధు చైర్మన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి సమక్షంలోనే ఇరువురు నేతలు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతూ.. వాగ్వాదాలకు దిగడం పార్టీ కేడర్‌ను తీవ్ర అయోమయానికి గురిచేసింది.

దేశంలో బీఆర్‌ఎస్‌దే అధికారం



ఆత్మీయ సమ్మేళనంలో అభివాదం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, ప్రజాప్రతినిధులు

రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి

శామీర్‌పేట్: దేశంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్ జస్వీ కన్వెన్షన్‌లో మంగళవారం మేడ్చల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు ఆత్మీయ సమ్మేళన సభ నిర్వహించారు. మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు 11 తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించుకున్నారు. అనంతరం మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. మేడ్చల్ నియోజకవర్గంలో 434 మంది ప్రజాప్రతినిధులు ఉన్నారని, భారతదేశంలోని ఏ నియోజకవర్గంలో ఎక్కడా లేరని, అందుకే మేడ్చల్ నంబర్ వన్ అన్నారు. ఇంత పెద్ద నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా గెలిపించినందుకు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ప్రజలను అబద్ధాలతో మోసం చేస్తున్నాయని, రాబోయే ఎన్నికల్లో ఈ రెండూ పార్టీలు సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతారని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశాన్ని ఆదానికి తాకట్టు పెట్టారని, దేశ ప్రభుత్వ సంస్థలను చాయ్ అమ్మినట్లు అమ్ముతున్నాడని ఆరోపించాడు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ అభివృద్ధి చెందిందని దేశమంతా కేసీఆర్ పాలన కావాలని ఇతర రాష్ట్రాల ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. సమావేశంలో మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పలువురు కార్యకర్తలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అప్పుల తెలంగాణగా మార్చిన సీఎం కేసీఆర్



వెంకటాపూర్‌లో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో వజ్రేశ్‌యాదవ్, రాజేశ్ తదితరులు

టీ పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో పాలన అవినీతికి కేరాఫ్‌గా నిలిచిందని, ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను సీఎం కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చాడని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఘట్‌కేసర్ మండల శాఖ ఆధ్వర్యంలో వెంకటాపూర్, కొర్రెముల్‌లో మంగళవారం నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జెండాలను ఆవిష్కరించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే పేదోడికి పిడికెడు అన్నం లభిస్తుందని, లేదంటే పేదలు మరింత నిరుపేదలుగా మారతారన్నారు. యాత్రలో టీపీసీసీ లీగల్ సెల్ సంయుక్త కార్యదర్శి అమరేందర్‌రెడ్డి, బోడుప్పల్ కార్పొరేటర్ అజయ్ యాదవ్, మండల అధ్యక్షుడు రాజేశ్, వెంకటాపూర్, కొర్రెముల్ కాంగ్రెస్ శాఖల అధ్యక్షులు పరమేశ్‌యాదవ్, భాస్కర్‌గౌడ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సుధాకర్, భోజిరెడ్డి, శేఖర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వినోద్ పాల్గొన్నారు.

‘అక్రమ నిర్మాణాలను సహించేది లేదు’



మాట్లాడుతున్న సర్పంచ్ రమాదేవి

ఘట్‌కేసర్: గ్రామంలో అక్రమ నిర్మాణాలను సహించేది లేదని సర్పంచ్ రమాదేవి అన్నారు. చౌదరిగూడ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ అధ్యక్షతన మంగళవారం పాలకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. సర్వే నంబర్ 714లోని అక్రమ నిర్మాణాలపై తీర్మానం చేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించాలని, 2023–24 హరితహారం కార్యక్రమానికి అవసరమైన మొక్కలు పెంచాలని తీర్మానించారు. పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ లీకేజీలకు మరమ్మతులు చేయించాలని తీర్మానం చేశారు. సమావేశంలో ఎంపీటీసీలు రామారావుముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, ఉప సర్పంచ్ మహేందర్‌గౌడ్, వార్డు సభ్యులు భోజిరెడ్డి, సుధాకర్, స్వామిదాస్, లక్ష్మణ్, శంకర్‌గౌడ్, సంయుక్త, వాణి, స్వాతి, అరుంధతి, కో ఆప్షన్ సభ్యుడు వెంకటేశ్, కార్యదర్శి గౌతమి పాల్గొన్నారు.

అంబేడ్కర్‌ను అవమానించిన బీఆర్‌ఎస్ నేతలు

మేడ్చల్: బీఆర్‌ఎస్ ఆవిర్భావం సందర్భంగా మేడ్చల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్‌ఎస్ జెండాలు కట్టి అంబేడ్కర్‌ను అవమానించారని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షుడు పానుగంటి మహేష్ అన్నాడు. బీఆర్‌ఎస్ జెండాలను కట్టి అంబేడ్కర్‌ను అవమానించడాన్ని నిరసిస్తూ మేడ్చల్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని పాలతో కడిగి అభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు అహంకారంతో వ్యవహరించారని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, శంకర్, గణేష్, నవీన్, అవినాష్, రాజేష్, శ్రీధర్, ప్రకాష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ ఎస్సీసెల్ నాయకులు

ఉత్సాహంగా బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం

బీఆర్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, ఆయా కాలనీల ప్రజలు పార్టీ జెండాలను ఆవిష్కరించారు. పలుచోట్ల స్వీట్లు పంచుకొని బీఆర్‌ఎస్ జిందాబాద్.. కేసీఆర్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం ఖాయమని ఈ సందర్భంగా పలువులు నేతలు పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి అనంతరం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలకు హాజరయ్యేందుకు పెద్దఎత్తున తరలివెళ్లారు.



ప్రతాపసింగారంలో జెండా ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి



మైసమ్మగూడలో బీఆర్‌ఎస్ జెండా ఆవిష్కరణలో కౌన్సిలర్లు, నాయకులు



బాలాజీనగర్‌లో జెండా విష్కరిస్తున్న జవహర్‌నగర్ మేయర్ కావ్య



జవహర్‌నగర్ 13వ డివిజన్‌లో కార్పొరేటర్ కుతాడి శ్రీకాంత్



అవుషాపూర్‌లో జెండా ఆవిష్కరిస్తున్న మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి



కండ్లకోయలో మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు



కీసరలో జెండావిష్కరణలో ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ తదితరులు



నాగారం మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి



అన్నోజిగూడలో జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి

పరామర్శ



ఘట్‌కేసర్: యశోద ఆస్పత్రిలో మోకాలు శస్త్రచికిత్స చేయించుకున్న మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావును మేడ్చల్ జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి ఆస్పత్రిలో మంగళవారం పరామర్శించారు. కుమార్‌ముదిరాజ్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

26న చీర్యాలలో ఇంటింటికీ సీపీఐ

కీసర: భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో ఈ నెల 26న చీర్యాల గ్రామంలో ఇంటింటికీ పాదయాత్ర నిర్వహిస్తామని సీపీఐ మేడ్చల్ నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకర్ అన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హాజరవుతారని తెలిపారు.



కీసర చర్చి సమీపంలో రోడ్డుపై విరిగిపడిన చెట్ల కొమ్మలు

దంచికొట్టిన వాన

మేడ్చల్: నియోజకవర్గం వ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. మంగళవారం మధ్యాహ్నం వరకు ఎండతో ఉక్కపోతగా ఉండి.. సాయంత్రం వాతావరణం ఆహ్లాదకంగా మారి.. రాత్రి సమయంలో ఈదురుగాలులతో జోరుగా వర్షం కురిసింది. రాత్రి ఏడు గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో గాలీవాన రావడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రెండు గంటల తర్వాత విద్యుత్ అధికారులు సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. మోకాలు లోతు నీళ్లు చేరడంతో రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి. వివిధ ప్రాంతాల నుంచి సాయంత్రం ఇళ్లకు చేరుకునే వారు ఇబ్బందులు పడ్డారు.



జవహర్‌నగర్‌లో జలమయమైన రహదారి



జోరుగా కురుస్తున్న వర్షం